ఆర్టీసీ డ్రైవర్లకు ట్రాఫిక్‌పై అవగాహన



ఆర్టీసీ డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ లక్ష్మణ్

చాంద్రాయణగుట్ట: నగరంలో రోజు రోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీతో సాధారణ పౌరులు ఇబ్బందులు పడకుండా ఆర్టీసీ డ్రైవర్లు నిబంధనలు పాటించాలని దక్షిణ మండలం ట్రాఫిక్ ఏసీపీ లక్ష్మణ్ సూచించారు. నగర ట్రాఫిక్ సీపీ విశ్వప్రసాద్ ఆదేశాల మేరకు ఫలక్‌నుమా, ఫారూఖ్‌నగర్ బస్సు డిపోలలో ఫలక్‌నుమా, బహదూర్‌పురా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు మోహన్‌రావు, కరుణ కుమార్‌తో కలిసి ఆర్టీసీ డ్రైవర్లకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఏసీపీ లక్ష్మణ్ మాట్లాడుతూ..హైదరాబాద్ మహానగరంలో కరోనా అనంతరం వాహనాల సంఖ్య పెరిగిపోతుందన్నారు. రోడ్డుపైకి వస్తున్న సాధారణ వాహనదారులు ఇంటికి వెళ్లేందుకు చాలా అవస్థలు పడాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయన్నారు. నగరంలో ప్రధాన రవాణా సంస్థగా ఉన్న ఆర్టీసీ డ్రైవర్లది కూడా ఇందులో కీలక పాత్ర ఉందన్నారు. బస్సు డ్రైవర్లు తప్పనిసరిగా బస్సు బేలలోనే ఆపాలని, రోడ్డు మధ్యలో ప్రయాణికుల కోసం బస్సును నిలిపి ట్రాఫిక్ జాంకు కారణం కారాదని, రోడ్డుకు ఎడమ వైపునే వాహనాలను నడపాలని, సెల్‌ఫోన్, డ్రంకన్ డ్రైవ్‌కు దూరంగా ఉండాలని ఆయన సూచించారు.

భూగర్భ జలాల పెంపునకు కృషి చేయాలి



ప్రచార రథం వద్ద డాక్టర్ గున్న రాజేందర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి

లంగర్‌హౌస్: ప్రతి వర్షపు నీటి బొట్టును ఇంకుడు గుంతల ద్వారా ఒడిసి పట్టి భూగర్భ జలాల పెంపునకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా కృషి చేయాలని గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ చైర్మన్ డాక్టర్ గున్న రాజేందర్‌రెడ్డి అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా ఇంకుడు గుంతల ప్రాముఖ్యతను వివరిస్తూ ఏర్పాటు చేసిన ప్రచార రథం ద్వారా లంగర్‌హౌస్‌లో బుధవారం చైతన్య కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ..నేటి కాంక్రీట్ నగరంలో ఇంకుడు గుంతలు, పచ్చని చెట్లు మాయమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యానాల ప్రభాకర్‌రెడ్డి, పరమానందం, గాంధారి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఐఎంఏ రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నిక



సుల్తాన్‌బజార్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) 2024–25, 2025–26 సంవత్సరాలకు రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నికైంది. ఈ మేరకు కోఠిలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యాలయంలో ఈ నెల 27న నూతన కార్యవర్గ పదవుల కోసం నిర్వహించిన ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినట్లు ఎన్నికల కమిషన్ చైర్మన్ డాక్టర్ విజయ్ చందర్‌రెడ్డి తెలిపారు. 2024–25 సంవత్సరానికిగాను ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా డాక్టర్ పి.కిషన్, 2025–26 సంవత్సరానికి అధ్యక్షుడిగా డాక్టర్ వి.విజయ్ కుమార్ ఎన్నిక కాగా, 2024 నుంచి 2026 సంవత్సరం వరకు ఐఎంఏ ప్రధాన కార్యదర్శి డాక్టర్ వి.అశోక్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారిగా డాక్టర్ దీన్‌దయాల్ ఎన్నికైనట్లు ఎన్నికల కమిషన్ చైర్మన్ డాక్టర్ విజయ్‌చందర్‌రెడ్డి ప్రకటించారు. అనంతరం ఆయన నూతనంగా అధ్యక్షులుగా ఎన్నికైన డాక్టర్ పి.కిషన్, డాక్టర్ విజయ్‌కుమార్‌కు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్ష కార్యదర్శులు, కోశాధికారిని ఐఎంఏ ప్రతినిధులు కలిసి అభినందనలు తెలియజేశారు.

పరామర్శ



యాకుత్‌పురా: బాణసంచా అగ్ని ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మలక్‌పేట్ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శృతిని బుధవారం యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అగ్ని ప్రమాదంలో తీవ్రగాయలతో బాధపడుతూ చిక్సిత పొందుతున్న శృతి ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉందన్నారు. ప్రస్తుతం ఆమెకు వెంటిలేటర్ సహాయంతో చిక్సిత అందిస్తున్నారని తెలిపారు. అగ్ని ప్రమాదంతో మృతిచెందిన మోహన్‌లాల్, ఉషాబాయి దంపతుల కుటుంబానికి తమ పార్టీ పూర్తి అండగా ఉంటుందన్నారు. మృతులకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున ప్రభుత్వం నష్టపరిహారం అందించాలన్నారు. శృతి ఆరోగ్యం మెరుగుపడాలని ప్రతి ఒక్కరూ ప్రార్థించాలని సూచించారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి



గోల్కొండ: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని టోలిచౌకీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.సుధాకర్‌రావు అన్నారు. బుధవారం మెహిదీపట్నం ఆర్టీసీ డిపోలో ఆర్టీసీ డ్రైవర్ల కోసం ఆయన ట్రాఫిక్ చట్టాలపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నిర్దేశించిన ప్రాంతాలలోనే ఆర్టీసీ డ్రైవర్లు బస్సులను ఆపాలన్నారు. ఎలాంటి సిగ్నల్స్ లేకుండా బస్సును ఆపితే ప్రమాదాలు జరుగుతాయన్నారు. ప్రమాదాల నివారణ కోసమే ట్రాఫిక్ చట్టాలు రూపొందించబడ్డాయని, వీటిని పాటిస్తే చాలామట్టుకు రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డ్రైవర్లతో పాటు సిబ్బంది, డిపో మేనేజర్ బీవీకే.మూర్తి తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష్మీ పూజలు



పూజలో పాల్గొన్న భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ తదితరులు



సైబర్ సిటీ విద్యుత్ సర్కిల్ కార్యాలయంలో..

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో బుధవారం రవీంద్ర భారతిలో ఆ శాఖ ఉద్యోగులు, సిబ్బంది లక్ష్మీ పూజను నిర్వహించారు. ఈ సందర్భంగా భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ.. దీపావళి పండుగ అందరిలోనూ వెలుగులను తీసుకురావడంతో పాటు సుఖః శాంతులను నింపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భాషా సాంస్కృతిక శాఖ ఉద్యోగులు హేమలతా రెడ్డి, రఘు, శ్రవంతి, రవి పాల్గొన్నారు.

నానల్ చౌరస్తాలో..

గోల్కొండ: మెహదీపట్నం నానల్ చౌరస్తాలో గల సైబర్ సిటీ విద్యుత్ సర్కిల్ కార్యాలయంలో దీపావళి లక్ష్మీ పూజలు మంగళవారం ఘనంగా జరిగాయి. విద్యుత్ ఆర్‌ఆర్ జోన్ సీజీఎం పాండ్యా నాయక్, ఎస్‌ఈ చంద్రశేఖర్, అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, ఎస్‌ఏఓ అంజయ్య, డివిజనల్ ఇంజనీర్ (టెక్నికల్) దామోదర్ రావు, భిక్షపతి, సైబర్ సిటీ సర్కిల్ ఎస్‌ఏఓ రవికుమార్, ఏఏవోలు మురళీగౌడ్, మనోహర్, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ కృష్ణయ్య, ఏడీఈ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

పాతబస్తీలో దీపావళి సందడి





లాల్‌దర్వాజ మోడ్‌లో దీపాంతలు ఖరీదు చేస్తున్న వినియోగదారులు

చార్మినార్: పాతబస్తీలో దీపావళి సందడి నెలకొన్నది. ఎటు చూసినా పండుగ వాతావరణం కనిపిస్తోంది. పండుగకు అవసరమైన వస్తువులను ఖరీదు చేయడంలో నిమగ్నమయ్యారు. దీంతో ఎక్కడ చూసినా సండడే సందడి. దీపావళి కోసం పాతబస్తీలోని ఘాన్సీబజార్, గుల్జార్‌హౌజ్, చార్మినార్‌లో ఏర్పాటు చేసిన రంగు రంగుల ప్రమిదలు వినియోగదారులను ఆకట్టుకుంటున్నాయి. ఒకప్పుడు కేవలం మట్టితో తయారు చేసే ప్రమిదలు మాత్రమే మార్కెట్‌లో అందుబాటులో ఉండేవి. ప్రస్తుతం వాటి స్థానంలో ఆకట్టుకునే విధంగా రంగు రంగుల దీపాంతలొచ్చాయి. వివిధ ఆకారాలలోని రంగురంగుల దీపాంతలు, ఫ్లోటింగ్ కాండిల్స్ మార్కెట్లో వినియోగదారులకు అందుబాటులో ఉన్నాయి

ప్రమిదల ధరలిలా..

ప్రమిదల ధరలు ఈసారి గతంలో కన్న కొంచెం అధికంగానే ఉన్నాయి. నీటిలో తేలియాడుతూ దేదీప్యమానంగా వెలిగే ఫ్లోటింగ్ కాండిల్స్‌ను ఖరీదు చేయడానికి ప్రజలు ఎంతో ఉత్సాహం చూపుతున్నారు. డజను ప్రమిదల ఖరీదు రూ.50 నుంచి రూ.150 వరకు, 100 ప్రమిదలు రూ.200 నుంచి 1000 వరకు లభిస్తుండగా..ఒక ఫ్లోటింగ్ క్యాండిల్ దీపం ఖరీదు రూ.50 నుంచి రూ.200 వరకు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయని గుల్జార్‌హౌజ్‌కు చెందిన ప్రమిదల వ్యాపారి ఒకరు తెలిపారు.



ఆకట్టుకుంటున్న అందమైన గిఫ్ట్ ప్యాకింగ్‌లు...

దీపావళి పండుగ అనంతరం బంధు, మిత్రులకు వారం రోజుల పాటు గిఫ్ట్ ప్యాక్‌లు అందజేయడం ఆనవాయితీగా వస్తోంది. దీపావళికి మిఠాయిలతో పాటు ఇతర గిఫ్ట్‌లను అందమైన ప్యాకింగ్‌లలో అందజేస్తారు. ఇచ్చేది ఎంత చిన్నదైనా.. దానిని అందమైన గిఫ్ట్ ప్యాకింగ్‌తో ఇస్తే..వారి మనసును ఇట్టే ఆకట్టుకోవచ్చు. ఇష్టమైన వారికి విలువైన కానుకలు, బహుమతులను ఆకట్టుకునే విధంగా వివిధ రకాల ప్యాకింగ్‌లలో అందజేయాలని చాలా మంది అనుకుంటారు. రకరకాల అందమైన గిఫ్ట్ ప్యాకింగ్‌లు పాతబస్తీ మార్కెట్‌లో సిద్ధంగా ఉన్నాయి.

దీపావళి పండుగకు..

దీపావళి పండుగకు బంధుమిత్రులకు మిఠాయిలు, కానుకలు అందజేయడం తెలుగు వారి ప్రత్యేకత. అలాగే అగర్వాల్, మార్వాడీలు, జైన్ కుటుంబీకులు తమ ఆచార వ్యవహారాలకు..సంస్కృతికి అద్దం పట్టే విధంగా దీపావళి పండుగ సందర్భంగా అత్తగారింట్లోని తమ కుమార్తెలకు ప్రత్యేక కానుకలను అందమైన ప్యాకింగ్‌ల ద్వారా అందజేస్తారు. పూలు, పండ్లు, స్వీట్స్‌ను అందమైన ప్యాకింగ్‌లతో అత్తవారింటికి తీసుకువెళ్లి తమ కుమార్తెలకు అందజేయడం తరతరాలుగా వస్తోందని ఉత్తర భారతీయులైన మార్వాడీలు చెబుతున్నారు. తమకు వియ్యంకుల కుటుంబీకుల పట్ల ఉన్న ప్రేమానురాగాలకు నిదర్శనంగా కానుకలను ఈ ప్యాకింగ్‌లలో పెట్టి అందజేయడం జరుగుతుందంటున్నారు.

నేడు అర్ధరాత్రి 12:15 గంటల నుంచి ఖజానా వితరణ



చార్మినార్: దీపావళిని పురస్కరించుకుని మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఈ నెల 29న ధన్‌తేరస్ నుంచి దీపావళి వేడుకలు ప్రారంభమయ్యాయి. బుధవారం రూప్‌చౌదస్ వేడుకల సందర్భంగా స్వామి వారికి రుద్రాభిషేకం, శ్రీ చక్ర అర్చన, గణపతి అభిషేకం, 108 అష్టోత్తర దీపోత్సవం, పంచహారతి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇక దీపావళి పండుగ రోజైన గురువారం అమ్మవారికి అభిషేకంతో ప్రత్యేక పూజలు మొదలవుతాయని ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు. రాత్రి 10 గంటలకు అష్టలక్ష్మీదేవి పూజ, 12:05 గంటలకు పంచహారతి అనంతరం రాత్రి 12:15 గంటలకు అమ్మవారి ఖజానా వితరణ కార్యక్రమం ఉంటుందన్నారు.

సమగ్ర కులగణన ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న విక్రమ్ గౌడ్

గన్‌ఫౌండ్రీ: సమగ్ర కులగణన అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు విక్రమ్‌గౌడ్ అన్నారు. బుధవారం బషీర్‌బాగ్‌లోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నవంబర్ 6వ తేదీ నుంచి ప్రారంభం కానున్న కులగణనపై విస్తృతంగా ప్రచారం కల్పించాలని బీసీ కమిషన్‌ను కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్‌లు పెరగాలన్నా.. ఇతర విద్య, ఉద్యోగ విభాగాలలో బీసీల వాటా పెరగాలన్నా..సమగ్ర కులగణన ఎంతో కీలకమని పేర్కొన్నారు. సమగ్ర కులగణనకు తక్షణమే ప్రశ్నావళిని రూపొందించి మార్గదర్శకాలు విడుదల చేయాలని, ఊరూరా దండోరా వేయించి కులాల వారి సామాజిక, ఆర్థిక రాజకీయ స్థితిగతులను లెక్కించాలని కోరారు.

‘గాంధీజీ గొప్ప సామాజిక శాస్త్రవేత్త’

లంగర్‌హౌస్: భావి ప్రపంచానికి శాంతియుత, అభివృద్ధి పథ జీవన మార్గాన్ని అందించిన గొప్ప సామాజిక శాస్త్రవేత్త మహాత్మా గాంధీ అని గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ చైర్మన్ డాక్టర్ గున్న రాజేందర్‌రెడ్డి అన్నారు. బాపూ ఘాట్‌లో భారీ గాంధీ విగ్రహ ఏర్పాటు తీర్మానానికి హర్షం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతా కార్యక్రమాలు లంగర్‌హౌస్‌లో కొనసాగాయి. ఈ సందర్భంగా రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ..మరుగుదొడ్లపై గాంధీజీ చిత్రపటాలు ఎందుకు పెడుతున్నారో అర్థం కావట్లేదన్నారు. ఈ విషయాన్ని వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని, ఇకనైనా గాంధీజీకి సరైన గౌరవమిస్తూ దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యానాల ప్రభాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



గాంధీ వేషధారణలో చిన్నారులు

‘ప్రాణనష్టం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నాం’



మాట్లాడుతున్న ఆనంద్‌కుమార్ గౌడ్

సుల్తాన్‌బజార్: ఈ నెల 27న హనుమాన్‌టేక్డీ ప్రాంతంలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నామని గోషామహల్ బీఆర్ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ అన్నారు. ఒకవేళ అక్కడ ఏదైనా జరగరానిది జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ఆయన ప్రశ్నించారు. అగ్నిమాపక సిబ్బంది, లా అండ్ ఆర్డర్ పోలీసులు, మున్సిపల్ ఆఫీసర్స్ అక్కడ అనుమతులు లేనిది చూడలేదా అని ఆయన నిలదీశారు. ఇళ్ల మధ్యలో దుకాణం పెడితే అధికారులు మొద్దు నిద్రలో ఉన్నారని ఆయన విమర్శించారు. దీపావళి పండుగ నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఎలాంటి తప్పిదం జరిగినా పెను ప్రమాధానికి దారితీస్తుందని ఆయన అన్నారు. అదేవిధంగా బొగ్గులకుంటలోని మయూరి పాన్ హౌస్ వల్ల అక్కడ ట్రాఫిక్ సమస్య తీవ్రతరం అవుతుందని స్థానికులకు వాహనదారులకు ఇబ్బంది కలుగుతుందని ఆయన అన్నారు. ట్రూప్‌బజార్‌లో ఒక మనిషి వెళితే మరో మనిషి వచ్చే స్థలం లేదని రాంగ్‌రూట్ ఉండదు, ఫుట్‌పాత్ కబ్జాలు చేస్తున్నా ట్రాఫిక్ పోలీసులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారన్నారు. షాపు యజమానులు ఫుట్‌పాత్‌లను ఆక్రమించినా కూడా పట్టించుకునే నాథుడే లేడన్నారు.

పార్కింగ్ సమస్య లేకుండా చూడాలి



వినతిపత్రాన్ని చూపుతున్న బీజేపీ నాయకులు

చాంద్రాయణగుట్ట: దీపావళిని పురస్కరించుకొని నల్లవాగు హిందూ శ్మశాన వాటికలో పూర్వీకుల సమాధులకు పూజలు నిర్వహించేందుకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పార్కింగ్ సదుపాయం కల్పించాలని బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జాలిగం చిరంజీవి కోరారు. ఈ మేరకు బీజేపీ నాయకులు బుధవారం చాంద్రాయణగుట్ట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. నల్లవాగు హిందూ శ్మశాన వాటిక బయట ప్రహరీని ఆనుకొని కొందరు అక్రమంగా కూరగాయల వ్యాపారం, మెకానిక్ షెడ్లు, ఆటోల అక్రమ పార్కింగ్ చేస్తున్నారన్నారు. వెంటనే అక్కడి నుంచి తొలగించాలన్నారు. చాంద్రాయణగుట్ట జాయింట్ కన్వీనర్ జి.వేణుగోపాల్, డివిజన్ అధ్యక్షుడు నాగరాజు, రియాసత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు శివకుమార్ తదితరులున్నారు.

ఎంఎన్‌జే ఆసుపత్రి వద్ద అన్నదానం

అబిడ్స్: ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రి వద్ద అసద్‌అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్, టీఎన్జీఓస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. దాదాపు 600 మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్, కేంద్ర సంఘం అసోసియేట్ అధ్యక్షుడు కస్తూరి వెంకట్, సిటీ అధ్యక్షుడు శ్రీకాంత్, కేంద్ర సంఘం సభ్యుడు శంకర్, హైదరాబాద్ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు కేఆర్.రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి ఖాలేద్ అహ్మద్, పీఆర్‌ఓ మహ్మద్ వహీద్, ఆసుపత్రి అధ్యక్షుడు శివకుమార్ పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని, కేఆర్.రాజ్‌కుమార్

శంకర్‌బాగ్ ఆలయం వద్ద అక్రమ నిర్మాణాన్ని నిలిపివేయండి



శ్రీనివాస్

అబిడ్స్: శంకర్‌బాగ్ తుల్జభవానీ ఆలయం వద్ద నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాన్ని నిలిపివేయాలని గోషామహల్ నియోజకవర్గం ఎమ్మార్పీఎస్ నాయకులు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్‌కు, ఇతర ఉన్నతాధికారులకు మెమోరాండం అందజేశారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ..తుల్జా భవానీ ఆలయం వద్ద దేవాదాయ శాఖ భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలయాన్ని కాపాడే బాధ్యత అందరిపై ఉందన్నారు. దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు స్పందించి వెంటనే అక్రమ నిర్మాణాన్ని ఆపాలన్నారు.

అభినందనలు



చార్మినార్: విశ్వవ్యాప్తంగా కృత్రిమ మేధస్సుపై పరిశోధనలు జరుగుతున్న తరుణంలో సాంకేతిక పరిజ్ఞానం అనూహ్య రీతిలో పెరగనుందని డాన్ హైస్కూల్ విద్యా సంస్థల చైర్మన్ ఫజల్ ఉల్ రెహమాన్ ఖుర్రం అన్నారు. కృత్రిమ మేధస్సు–ఆందోళనలు అనే అంశంపై జరిగిన సైన్స్ సదస్సులో డాన్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థి మహ్మద్ ఫాజిల్ రెండో స్థానాన్ని దక్కించుకుని ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాల ఆవరణలో జరిగిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఏఐలో అత్యంత ప్రతిభను కనబరిచి అగ్రస్థానంలో నిలవాలన్నారు.

అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించాలి



బల్దియా డీఎంసీతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తే అభివృద్ధి పనులు అనుకున్న సమయంలో పూర్తవుతాయని ఎమ్మెల్యే కౌసర్ మోహినుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన కార్యాలయంలో డీఎంసీ శశిరేఖతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్వాన్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో కొంత కాలంగా సాగుతున్న అభివృద్ధి పనులపై ప్రజలు తీవ్రంగా నిలదీస్తున్నారన్నారు. అభివృద్ధి పనుల కోసం తవ్విన గుంతలతో సమస్యలు రెట్టింపు అవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా టోలిచౌకీ చౌరస్తా వద్ద డ్రైనేజీ పైప్‌లైన్ పనులు త్వరితగతిన పూర్తికాకపోవడంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని ఆయన అన్నారు. లంగర్‌హౌస్, టోలిచౌకీ డివిజన్లలో అధికారుల పర్యవేక్షణ సరిగా లేకపోవడంతో కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. పనుల్లో పూర్తిగా నాణ్యత లోపించిందని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు.



यूनियन बैंक యూనియన్ బ్యాంక్
సీతారాంపురం బ్రాంచి (05101): డి.నెం. 3-1-1, [illegible] రోడ్డు, సీతారాంపురం, విజయవాడ, ఏపీ-520010

ఈ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటైజేషన్ మరియు రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 ప్రకారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సీతారాంపురం బ్రాంచి అధీకృత అధికారిగా [illegible] ... **బకాయి మొత్తము ది. 30–09–2024 నాటికి చెల్లించవలసిన బకాయి మొత్తం రూ. 2,18,69,481.52/–** [illegible] ... 30–09–2024 నుండి [illegible] యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సీతారాంపురం బ్రాంచి (05101) వారికి ఈ-వేలం అమ్మకం ద్వారా ది. 29–11–2024న [illegible]
బిడ్లు సమర్పించుటకు ఆఖరుతేది: ఈ-వేలం ప్రారంభానికి ముందు వరకు

రుణగ్రహీత (లు) / సహ రుణగ్రహీత (లు) / తనఖాదారు (లు): మెస్సర్స్ [illegible] ట్రాన్స్‌పోర్ట్, ఫ్లాట్ నెం. టిడి–9, బ్లాక్ నెం. 4, [illegible] – 521212. **మేనేజింగ్ పార్టనర్:** శ్రీ [illegible], ఫ్లాట్ నెం. 407, డి.నెం. 39, 34, 2/4/49, [illegible] **పార్టనర్:** శ్రీ [illegible], డి.నెం. 4–76, [illegible] **హామీదారు:** శ్రీ [illegible] వెంకట అప్పారావు, హెచ్.నెం. 1–2–709/బి–22, [illegible] మెహదీపట్నం, హైదరాబాద్ – 5000028

స్థిరాస్తి వివరములు

సెక్యూరిటీ డాక్యుమెంట్ నెం. సేల్ డీడ్ నెం. 1711/1986, [illegible] – 500028, మెహదీపట్నం, [illegible] ఆర్.ఎస్.నెం. 29/1, 2, 3 [illegible] ప్లాట్ నెం. 22కి చెందిన 273.00 చ.గజాల [illegible] **హద్దులు : ఉత్తరం :** ప్లాట్ నెం. 21, **తూర్పు :** 30 అ. [illegible]

రిజర్వు ధర (రూ.) : 2,35,02,000/- ధరావత్తు ధర (రూ.) : రూ. 23,50,200/- [illegible] : రూ. 2,50,000/-

వేలం అమ్మకం యొక్క వివరణాత్మక నిబంధనలు మరియు షరతుల కొరకు https://ebkray.in మరియు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెబ్ సైట్ : www.unionbankofindia.co.in నందు చూడగలరు. [illegible] మొబైల్ నెం. 9652520269, బ్రాంచి Mail ID: ubin0805106@unionbankofindia.bank లో సంప్రదించవచ్చు.

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్ 2002 లోని రూలు 8(6)/ రూలు 9(1) అనుసరించి చట్టబద్ధమైన 15 రోజుల అమ్మకం నోటీసు

[illegible]

తేది : 28-10-2024
ప్రదేశం : విజయవాడ
సం/- అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా



సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9010221230
9010463222
9553955684